నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | KAMAREDDY

## స్పందన అనూహ్యం..

నమస్తే ప్రచురించిన కథనం ఎందరిలోనో స్పందన తీసుకొచ్చింది. ప్రధానంగా ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) బాధ్యులు, పలువురు చరిత్రకారులు, స్వచ్ఛంద సంస్థలు కదిలొచ్చాయి. మెట్ల బావిని సందర్శించి అద్భుతమైన శిలా సంపదను, రాతి కట్టడం మహాత్మ్యాన్ని పరిశీలించి, పునర్వైభవం తెచ్చే దిశగా చర్యలు ప్రారంభించాయి. బావి చరిత్రను ఆర్కియాలజిస్టులు, అధికారులు అప్పటి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు వివరించారు. దీంతో ముగ్ధుడైన ఆయన పలుమార్లు బావిని సందర్శించి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో నాగన్నబావి పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. నాగన్న బావి అభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థ రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనారమేశ్‌కు దృష్టికి తీసుకెళ్లగా, అమె కూడా పలుమార్లు సందర్శించి అభివృద్ధి పనులు ప్రారంభించారు.

## అందరి సహకారంతో..

నాగన్న బావి అభివృద్ధి చేయడానికి అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారం తీసుకున్నారు. కలెక్టర్‌తో పాటు మండల స్థాయి ప్రజా ప్రతినిధులు శ్రమదానం చేసి పూడికతీత పనులు చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలతో పరసరాలను శుభ్రం చేయించారు. బావి పై భాగంలో, అంతర్భాగంలో మొలచిన చెట్లను తొలగించారు. శిథిల దశకు చేరిన చారిత్ర కట్టడాలను తిరిగి యథావిధిగా నిర్మాణం చేయించారు. ఇందు కోసం ప్రత్యేకంగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిని పిలిపించారు. కేంద్ర నోడల్ బృందం సభ్యులు సైతం పునరుద్ధరణ పనులకు సహకరించారు. కలెక్టర్ పాటిల్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో వచ్చిన ప్రస్తుత కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సైతం నాగన్నబావిపై ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులను కేటాయించి, అభివృద్ధి పనులకు సహకరించారు.

## పర్యాటక కేంద్రంగా..

చారిత్రక మెట్లబావిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టారు. బావి చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. పర్యాటకులకు ఆహ్లాదం పంచడానికి పూల మొక్కలు నాటించారు. హైమాస్ట్ లైట్లను బిగించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి నాగన్న బావి వద్దకు వెళ్లడానికి ప్రత్యేకంగా రహదారి వేశారు. బావి చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి తుది మెరుగులు దిద్దారు. పూర్వవైభవం సంతరించుకున్న నాగన్నబావిని నేడు (శుక్రవారం) ప్రారంభించనున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, రెయిన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ కల్పనారమేశ్ తదితరులు ప్రారంభోత్సవానికి హాజరు కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్‌రావు బుధవారం పరిశీలించారు.


నాగన్న బావిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- శిథిలావస్థ నుంచి పునరుజ్జీవం
- 'నమస్తే తెలంగాణ' సాధించిన విజయం
- మరుగున పడిన దశ నుంచి మెరుగుపడిన బావి

# నాగన్నబావికి మహర్దశ

నేడు ప్రారంభోత్సవం


వావ్.. తెలంగాణ రాణికి వావ్

నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనం (ఫైల్)

నమస్తే తెలంగాణ ప్రతినిధి (నిజామాబాద్) / లింగంపేట, సెప్టెంబర్19 : మరుగున పడిన వారసత్వ సంపదకు 'నమస్తే తెలంగాణ' కారణంగా పునరుజ్జీవం దక్కింది. శిథిలావస్థకు చేరిన చారిత్రక కట్టడం తిరిగి పూర్వవైభవం సాధించింది. లింగంపేట మండల కేంద్రంలో గల పురాతన కట్టడమైన నాగన్న బావి ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. 18వ శతాబ్దంలో నిర్మించిన ఈ మెట్ల బావిపై ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో చారిత్రక కట్టడం శిథిలావస్థకు చేరింది. నాగన్నబావి దుస్థితిని, వారసత్వ సంపద దురావస్థను 'నమస్తే తెలంగాణ' ప్రపంచానికి చాటి చెప్పింది. 2020 మే 28న ప్రధాన సంచికలో 'వావ్.. తెలంగాణ రాణికీ వావ్' శీర్షికన ప్రచురితమైన ఆ కథనం పురాతన బావికి పట్టిన నిర్లక్ష్యపు చెదలును చెరిపేసింది. ఐదు అంతస్తులు, అష్టదిక్కులతో నిర్మితమైన ఈ అద్భుతమైన కట్టడం తిరిగి పూర్వవైభవం సాధించేలా చేసింది.


కమ్మర్‌పల్లిలో వేతనాలు ఇవ్వాలని కోరుతున్న పారిశుద్ధ్య కార్మికులు

# వేతనాలు ఇవ్వండి సారు

మోర్తాడ్/బీబీపేట్, సెప్టెంబర్ 19: వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాలను పోట్ట పోసుకునేది ఎట్లా అని గ్రామపంచాయతీ సిబ్బంది వాపోయారు. జీతాలు ఇవ్వాలని ఓచోట కార్మికుడు టవర్ ఎక్కగా, మరోచోటా అధికారులతో వాగ్వాదానికి దిగారు. బీబీపేట్ మండలం ఇస్సానగర్‌లో జీపీ కార్మికుడు కొమ్ము రాజు గురువారం టవర్ ఎక్కాడు. మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, ఇట్ల అయితే ఎట్ల బతికేదని అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. తోటి కార్మికులు, గ్రామస్తులు నచ్చజెప్పడంతో దాదాపు రెండు గంటల తర్వాత కిందకు దిగొచ్చాడు. మరోవైపు, కమ్మర్‌పల్లి జీపీ కార్మికులు సైతం అధికారులతో వాగ్వాదానికి దిగారు. రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని మాజీ ఎంపీటీసీ సుధాకర్, కమ్యూనిస్టు నేతలు అశోక్, సత్తెక్క అధికారులను నిలదీశారు. జూలై నెలకు సంబంధించిన వేతనాలు ఎస్టీవోలో వేశామని కార్యదర్శి శాంతికుమార్ చెప్పగా, రాలేదని కార్మికులు బదులిచ్చారు దీంతో హుటాహుటిన ఒక నెల జీతాలు చెల్లించారు.

### కాసుల కక్కుర్తి..

- వినాయక ఉత్సవాల సందర్భంగా జిల్లాలో 9వ రోజు, 11వ రోజు నిమజ్జన కార్యక్రమాలు భారీగా జరుగుతుంటాయి. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగియడానికి గాను ఈ రెండు రోజుల్లో మద్యం విక్రయాలపై సీపీ ఆంక్షలు విధించారు. కానీ ఆయన ఆదేశాలకు విరుద్ధంగా క్షేత్ర స్థాయిలో వ్యవహారం జరిగింది. పోలీసుల చర్యలు సత్ఫలితాలను ఇవ్వకపోగా, సామాన్య జనాల జేబులకు చిల్లులు తెచ్చి పెట్టింది. ఆంక్షలను అడ్డం పెట్టుకుని మద్యం వ్యాపారులు దొంగచాటుగా అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. రూ.150 ఉండే లైట్ బీర్‌ను రూ.180-200 వరకు విక్రయించారు. లిక్కర్ రేట్లు సైతం పెంచేసి దండుకున్నారు. వైన్స్ దుకాణాల మూత అన్నది కేవలం సాంకేతికంగానే కనిపించినా, విక్రయాల నిలిపివేత ఎక్కడా జరుగలేదు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్న రోజే నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బీర్ సీసాలతో యువకులు దాడి చేసుకోవడమే అందుకు నిదర్శనం.
- నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్డు వెంట ఓ మద్యం దుకాణం, బార్ షాపుల నిర్వాహకులు గుట్టుగా పెద్ద ఎత్తున ఈవిక్రయాలు జరిపారు. పులాంగ్ రోడ్డు, బైపాస్ రోడ్డులో పలు బార్లు, హోటళ్లు, వైన్ దుకాణాల్లో తెర వెనుక షటర్లు తీసి మరీ మద్యం అమ్మకాలు చేపట్టారు. పోలీసులకు తెలిసినా పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.
- రెంజల్ మండలంలోనూ ఇదే తీరు కనిపించింది. నిర్మానుష్య ప్రాంతాలు, వాహనాల్లో తిరుగుతూ విక్రయాలు జరిపారు. నవీపేట మీదుగా బాసరకు 8ఫీట్ల లోపు వినాయక ప్రతిమలు బయలుదేరాయి. ఈ మార్గంలోనూ అక్రమార్కులు స్థానిక మద్యం వ్యాపారులతో చేతులు కలిపి అధిక ధరలకు మద్యం అమ్మారు. ఇక ఉమ్మెడకు వెళ్లే మార్గంలో మాక్లూర్, నందిపేట మండలాల్లోనూ దారిపొడవునా విచ్చలవిడిగా అమ్మకాలు జరిగాయి. బెల్టుషాపుల్లో అయితే మద్యం విక్రయాలకు అడ్డే లేకుండా పోయింది. నిమజ్జనంలో నిమగ్నమైన పోలీసులు నిద్రలేని రాత్రులు గడిపారు. కానీ నిఘా వ్యవస్థ మాత్రం నిద్దుర పోయింది. అక్రమ విక్రయాలపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ సీపీని అప్రమత్తం చేయడంలో విఫలమైంది. అటు టాస్క్‌ఫోర్స్ విభాగం కూడా వైఫల్యం చెందింది. ఎక్సైజ్ శాఖ అధికారులైతే ఈ వ్యవహారంలో కళ్లు మూసుకున్నారు. తమ టార్గెట్లు పూర్తి చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలను ప్రోత్సహించినట్లు తెలిసింది.



- నిషేధాజ్ఞలకు నీళ్లు.. విక్రయాలు ఫుల్లు
- సీపీ ఆదేశాలు బేఖాతరు
- భారీగా సొమ్ము చేసుకున్న వ్యాపారులు
- పూర్తిగా సహకరించిన ఎక్సైజ్, పోలీసులు?
- వారంలోనే రూ.27.73 కోట్ల మద్యం విక్రయాలు

# ఆంక్షల వేళ.. మద్యం వరద

నిజామాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పోలీసుల ఆంక్షల వేళ మద్యం విక్రయాలు పోటెత్తాయి. బీర్లు, లిక్కర్ అమ్మకాలు వెల్లువెత్తాయి. వాస్తవానికి మద్యం విక్రయాలపై పోలీసులు నిషేధం విధిస్తే అసలు అమ్మకాలే చేపట్టొద్దు. కానీ, అందుకు విరుద్ధంగా భారీగా విక్రయాలు చోటు చేసుకోవడం విస్మయానికి గురి చేస్తున్నది. వినాయక నిమజ్జనం సందర్భంగా సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ మద్యం విక్రయాలపై ఆంక్షలు విధించారు. బహిరంగ మద్యపానాన్ని నిషేధిస్తూ సీపీ ఈ నెల 12న ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వారం వ్యవధిలో రెండు రోజుల పాటు (ఆది, మంగళవారాల్లో) అమ్మకాలను నిలిపి వేయాలని ఆదేశించారు. అదనపు జిల్లా మెజిస్ట్రేట్‌గా తనకున్న విచక్షణాధికారాలను ఉపయోగించి తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ యాక్ట్ 1968 ప్రకారం సెక్షన్ 20(1)ని అనుసరించి ఆంక్షలు విధించారు. కానీ సీపీ ఆదేశాలకు విరుద్ధంగా భారీగా మద్యం విక్రయాలు జరగడం గమనార్హం. మద్యం వ్యాపారుల దురాశకు తోడు కొందరు ఎక్సైజ్, పోలీసు శాఖ సిబ్బంది వారికి సహకరించడం వల్లే నిషేధ కాలంలోనూ విచ్చలవిడిగా అమ్మకాలు జరిగాయి.

### వారంలో కోట్లల్లో వ్యాపారం..

మాక్లూర్ మండలం మాదాపూర్‌లోని ఐఎంఎల్ డిపో గణాంకాల ప్రకారం.. గత వారం రోజుల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా రూ.27.73 కోట్లు మద్యం అమ్మకాలు జరిగాయి. సెప్టెంబర్ 11న ఉమ్మడి జిల్లాలో కేవలం రూ.62 లక్షల విలువ చేసే 456 లిక్కర్ కేసులు, 1831 బీర్ కేసులు విక్రయించగా, 12వ తేదీన ఏకంగా రూ.6.25కోట్లు, 13వ తేదీన కూడా రూ.5.10కోట్లు, 14న రూ.4.82 కోట్ల మద్యాన్ని వైన్ షాపుల యజమానులు కొనుగోలు చేశారు. ఆంక్షలు అమలు అవుతాయనే ముందుచూపుతోనే నిల్వ చేసుకుని, ఆ తర్వాత పక్కదారి పట్టించారు. సెప్టెంబర్ 18న (బుధవారం) రికార్డు స్థాయిలో రూ.10.30 కోట్లు విలువ చేసే 8,650 లిక్కర్ కేసులు, 27,421 బీర్ కేసులు అమ్ముడయ్యాయి. పోలీసుల ఆంక్షలు నిక్కచ్చిగా అమలై ఉంటే రూ.కోట్ల విలువ చేసే మద్యం ఎక్కడికక్కడే ఉండిపోవాలి. అలా కాకుండా రికార్డు స్థాయిలో లిక్కర్ బాటిళ్లు, బీర్ సీసాలకు వైన్ షాపుల నుంచి ఇండెంట్ రావడం మద్యం వ్యాపారుల గిమ్మిక్కును, పోలీసులు, ఎక్సైజ్ శాఖ తీరును తేటతెల్లం చేస్తున్నది.

### తహసీల్ ఆఫీసుల ఎదుట బైఠాయింపు
### ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు


మాక్లూర్ తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు, రైతులు

# రుణమాఫీ కోసం రైతుల ధర్నా

నమస్తే తెలంగాణ యంత్రాంగం, సెప్టెంబర్ 19: రూ.2 లక్షల రుణ మాఫీ కోసం ఉద్యమాన్ని ప్రారంభించిన రైతులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఆర్మూర్ డివిజన్‌లోని అన్ని తహసీల్ కార్యాలయాల ఎదుట గురువారం బైఠాయించారు. ఆర్మూర్, మాక్లూర్, నందిపేట్, ఆలూర్, మోర్తాడ్, వేల్పూర్, జక్రాన్‌పల్లి తదితర మండలాల్లోని తహసీల్ ఆఫీసుల ఎదుట ధర్నా చేపట్టారు. మాట ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రైతులందరికీ రూ.2లక్షల రుణం మాఫీ చేస్తామని, ఇప్పుడు ఆంక్షలు విధించారన్నారు. అనేక ఆంక్షలు పెట్టి 20 శాతం రుణాలు మాత్రమే మాఫీ చేశారని, మిగతా వారికి మొండిచేయి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకులు, ఆఫీసుల చుట్టూ తిప్పుతూ రైతుల బతుకులతో ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని విమర్శించారు. రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా బాగుపడలేదని, కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా, వరికి రూ.500 బోనస్ అమలు చేయకపోతే రైతుల సత్తా ఏమిటో చూపిస్తామని రైతు జేఏసీ ప్రతినిధులు ప్రభాకర్, లింగారెడ్డి, యాదాగౌడ్ హెచ్చరించారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.


నందిపేట్ మండలకేంద్రంలో ధర్నాచేస్తున్న ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు, రైతులు

# అరెస్టుల పర్వం

- బీఆర్ఎస్ నేతలపై జులుం
- జిల్లావ్యాప్తంగా నాయకుల ముందస్తు అరెస్టు


కామారెడ్డిలో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి ఠాణాకు తరలించిన పోలీసులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, సెప్టెంబర్ 19 : జిల్లాలో అక్రమ అరెస్టుల పర్వం కొనసాగుతున్నది. 'ముందస్తు' పేరిట బీఆర్ఎస్ నేతలను పోలీసు శాఖ అదుపులోకి తీసుకుంటున్నది. తాజాగా గురువారం కూడా ఎక్కడికక్కడ గులాబీ శ్రేణులను అరెస్టు చేసి ఠాణాలకు తరలించారు. ఇంట్లో ఉన్న వారిని, పని మీద బయటకు వెళ్లిన పట్టుకుని పోలీసుస్టేషన్లలో నిర్బంధించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన విధంగా షరతుల్లేని రూ.2లక్షల రుణమాఫీ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ప్రజాభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. అయితే, శాంతియుతంగా చేపట్టనున్న ఈ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అడ్డంకులు సృష్టించారు. ఎక్కడికక్కడ అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి.

# ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలి

- గడువులోగా సర్వే పూర్తవ్వాలి
- సీఈవో పరిశీలకుడు హమీద్


సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీఈవో పరిశీలకుడు హమీద్

కంఠేశ్వర్, సెప్టెంబర్ 19 : ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా ఓటరు జాబితా సవరణ కోసం కొనసాగుతున్న ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) కార్యాలయం నుంచి పరిశీలకులుగా విచ్చేసిన డిప్యూటీ కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి ఆయన గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జిల్లాలో కొనసాగుతున్న ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ, ఇంటింటి సర్వే, పోలింగ్‌స్టేషన్ల నిర్వహణ, స్వీప్ కార్యకలాపాలు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై నియోజకవర్గాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 26తో గడువు ముగియనున్న దృష్ట్యా ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని, 100 శాతం సర్వే పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే సర్వే పూర్తిచేసిన బీఎల్‌వోలను అవసరం ఉన్నచోట సర్దుబాటు చేయాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేలా సన్నద్ధమై ఉండాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఓటరు జాబితా సవరణ, స్వీప్ కార్యకలాపాలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాల గురించి వివరించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, బోధన్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతి, కిరణ్మయి, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రెవెన్యూ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.